ప్రజాశక్తి
సోమవారం 27 మే 2024 5
శ్రీ సత్యసాయి



కరిడికొండలో చిరుత సంచారం

ప్రజాశక్తి - గుత్తి

అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని కరిడికొండ గ్రామ సమీపంలో శనివారం రాత్రి చిరుత సంచరించిందని గ్రామస్తులు తెలిపారు. చిరుత సంచారంతో గ్రామస్తులు వణికి పోతున్నారు. గ్రామ సమీపంలో కుక్కపై చిరుత దాడి చేసి నోట కరిచి తీసుకెళ్తుండగా సాయిబాబా మెటల్ స్టోన్ క్రషర్ లో పనిచేస్తున్న ఇరువురు ఉద్యోగులు ద్విచక్ర వాహనంలో వెళ్తూ ఆ ఘటనను చూసి కేకలు పెట్టారు. గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారందరూ వచ్చి పెద్దపెట్టును కేకలు పెట్టడంతో చిరుత గ్రామం మధ్యలో ఉన్న కొండపైకి పరుగు తీసినట్లు గ్రామస్తులు చెప్పారు. సమాచారం తెలుసుకున్న ఫారెస్టు బీట్ అధికారి పి.రమేష్ బాబు, సహాయ బీట్ అధికారి తిమ్మప్ప సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్ళి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం కూడా గాలింపు చర్యలు చేపట్టామని ఫారెస్టు బీట్ అధికారి పి.రమేష్ బాబు తెలిపారు. చిరుత ఆచూకీ లభించలేదనిగాలింపు చర్యలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

ఎవరి అంచనాలు వారివి...

సామాజిక తరగతుల వారీగా లెక్కలు

కులాల వారీగా బేరీజులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు మే 13న పూర్తయ్యాయి. అప్పటి నుంచి అభ్యర్థులు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. తాము విజయం సాధిస్తామంటే.. తామే విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే లోలోనా మాత్రం విజయావకాశాలపైన గుబులు మాత్రం వీడటం లేదు. సామాజిక తరగతులు, కులాల వారీగానూ లెక్కలు వేసుకుంటున్నారు. దీనిపై పందాలు కూడా కాస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు పార్లమెంటు, 14 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అన్ని చోట్ల ప్రధాన పోటీ వైసిపి, టిడిపిల మధ్యనే ఉంది. అయితే ఈ ఎన్నికల్లో ఎన్ని స్థానాల్లో వైసిపి గెలుపొందుతుంది...ఎన్నింటిలో టిడిపి విజయం సాధిస్తుందన్న లెక్కలేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు పార్టీలకు తగినంత బలముంది. అయితే 2014, 2019 ఎన్నికల్లోనే ఫలితాలు పూర్తిగా వన్సైడ్ వచ్చాయి. అంతక మునుపు టిడిపి ఆవిర్భావ సమయంలో మాత్రమే ఈ రకమైన ఫలితాలొచ్చినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. 2014కు ముందు వరకు జరిగిన ఎన్నికల్లో ప్రధానంగా అధికార పార్టీకి ఎనిమిది, ప్రతిపక్ష పార్టీకి ఆరు వరకు స్థానాలొస్తూ ఉండటమే అధికంగా జరుగుతూ వచ్చింది. కాని 2014 నుంచి జిల్లాలో ట్రెండ్ మారింది. ఒకవైపే ఫలితాలొస్తున్నాయి. ఈసారి ఫలితాలు ఏ రకంగా ఉండనున్నాయన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.. ఈసారి ఫలితాలు ఏకపక్షంగా ఉండనున్నాయా లేక మిశ్రమంగా వస్తాయా అన్నది చర్చ నడుస్తోంది. అయితే ఫలితాలు వన్సైడ్ఉంటాయని తాజా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ, రాప్తాడు తాజా, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. టిడిపి నాయకులు కూడా ముందు నుంచి ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని చెబుతున్నారు. ఏది ఏమైనా ఈసారి ఓటర్ల మనోగతం గుర్తించడం నేతలకే కాకుండా విశ్లేషకులకు కూడా అంతుబట్టకుండా ఉంది. సామాజికవర్గాల వారీగా చూసినప్పుడు ఉద్యోగులు, యువత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారన్న చర్చ నడుస్తుండగా, మహిళలు, గ్రామీణ ప్రాంతంలో అధికారపార్టీకి అనుకూలంగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇకపోతే ఉమ్మడి జిల్లాలో మైనార్టీలు మున్సిపల్ పట్టణాల్లో ప్రభావం చూపేంత సంఖ్య ఉంది. ముస్లిములు ఈసారి కాంగ్రెసు వైపు కొద్దిగా మొగ్గుచూపినట్టు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ ఓట్లు ఏ మేరకు అటు మళ్లాయన్నది గుర్తించలేకుండా ఉన్నట్టు నేతలు చెబుతున్నారు. ఈ ఓట్లు ఎన్ని మార్పు జరిగుంటే దాన్ని బట్టి వచ్చే ఫలితాలలపైనా ప్రభావం ఉండే అవకాశాలు కొన్ని నియోజకవర్గాల్లో ఉన్నాయి. ఇలా సామాజిక తరగతులు, కులాల వారీగా లెక్కలు తీసుకుని తమకు అనులకూలమంటే...తమకు అనుకూలంగా ఉంటాయని నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. ఈ అంచనాలు తేలే సమయం కూడా దగ్గరపడుతుండటంంతో సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. ఓట్ల లెక్కింపునకు సరిగ్గా పదిరోజుల సమయం ఉంది. సమయం దగ్గరపడుతున్న కొద్ది సర్వత్రా ఉత్కంఠత పెరుగుతూపోతోంది.

పుట్టపర్తి మున్సిపాలిటీకి సొంత భవనం కరువు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

గ్రేట్ 2 మున్సిపాలిటీగా ఏర్పడిన పుట్టపర్తి మున్సిపాలిటీకి సొంత భవనాలు లేక అప్పటి మేజర్ పంచాయతీ భవనంలోనే అధికారులు ఇబ్బందులు పడుతూ పనిచేయాల్సి వస్తోంది. మేజర్ పంచాయతీగా ఉన్న పుట్టపర్తిని మొదట నగర పంచాయతీగా 2011లో ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు మూడేళ్ల పాటు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పాలన సాగింది. 2015లో నగర పంచాయతీ ఎన్నికలు జరిగిన తరువాత నూతన పాలకవర్గం ఏర్పడింది. అప్పట్లో టిడిపి అధికారంలో ఉండేది. నగర పంచాయతీకి ప్రత్యేక భవనాలు ఉండాలని అప్పటి మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో రెండు చోట్ల భవన నిర్మాణం కోసం స్థల సేకరణకు ప్రయత్నాలు జరిగాయి. అయితే ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాచలేదు. దీంతో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నాయకులు మున్సిపాలిటీకి స్థల సేకరణ కూడా చేయలేదని అసమర్థ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అని విమర్శించారు. ఆ తరువాత 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడింది. అనంతరం పుట్టపర్తి నగర పంచాయతీ గ్రేటర్ 2 మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. వైసిపి ప్రభుత్వం కూడా స్థల సేకరణ చేయకుండా ఐదేళ్లు దాటవేసింది. దీంతో అధికారులు ఇరుకైన గదులలో కొనసాగుతున్నారు. పాలకవర్గ సమావేశాలు కూడా సత్యసాయి ట్రస్ట్కు చెందిన భవనంలో కొనసాగిస్తున్నారు. వచ్చే నూతన ప్రభుత్వమైనా మున్సిపాలిటీకి నూతన భవన నిర్మాణాలకు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కదిరి మున్సిపాలిటీ భవనం

'శ్రీరామిరెడ్డి' కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి

- కలెక్టర్ ఇచ్చిన హామీ అమలు కాకపోతే ఉద్యమిస్తాం
- కార్మికులపై అక్రమ కేసులు ఎత్తివేయాల్సిందే
- రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు, పిఎఫ్ తక్షణమే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం స్థానిక జెవివి జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కరువు జిల్లాలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్రజల జీవనాధారంగా నిలిచిందన్నారు. 650 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తూ 600 మంది కార్మికులు వచ్చే వేతనాల్లో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. 15 ఏళ్లుగా కార్మికులు పనిచేస్తున్నప్పటికి వేతనాలు పెంపుదల జరగడం లేదన్నారు. మూడు ప్రభుత్వాలు మారినా కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంపుదల చేయాల్సి ఉన్నా చేయడం లేదన్నారు. పైగా చేసిన పనికి వేతనాలు పొందాలంటే ప్రతి నెలా రోడ్లెక్కాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కార్మికుల మీద కమీషన్ల కోసం పని చేస్తున్న కాంట్రాక్టర్లు, హక్కులు కాపాడాల్సిన కార్మిక శాఖ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కార్మిక శాఖ పర్యవేక్షణ ఏమాత్రం లేదన్నారు. కాంట్రాక్టర్లకు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. వేతనాల కోసం వినతిపత్రాలు, నిరసనలు, ధర్నాలు చేసినా స్పందన రాకపోవడంతోనే కార్మికులు సమ్మెలు చేపడుతున్నారని తెలిపారు. సమ్మె నేపథ్యంలో అధికారులు హామీలిచ్చి కొంత మేరకు వేతనాలు ఇచ్చి సమ్మె విరమింపజేయడం, యధావిధిగా వేతనాలు బకాయిలు పడటం కార్మికులు రోడ్లు ఎక్కాల్సి రావడం తంతుగా మారిందని అన్నారు. ప్రభుత్వం ఒక రకంగా పొమ్మన లేక పొగ పెట్టే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. తాగునీటి పథకం ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగా రాబోయే రోజుల్లో నీటి కొళాయిలకు మీటర్లు అని అన్నారు. నిర్వహణ బాధ్యతలు అంగన్వాడీ ఏజెన్సీలకు అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకునేందకు కుట్ర చేస్తోందన్నారు. తాగునీటికి సరఫరా పథకానికి నికర బడ్జెట్ కేటాయించడంలోనూ ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చే శ్రీరామిరెడ్డి పథకాన్ని ప్రభుత్వమే యధావిధిగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. . బకాయి పడ్డ వేతనాలు, పిఎఫ్ తక్షణమే చెల్లించాలన్నారు. కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ శివశంకర్పై చర్యలు తీసుకుని, కాంట్రాక్ట్ లైసెన్స్ బ్లాక్ లిస్ట్లో పెట్టాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కార్మికుల వేతనాల్లో రూ.2 వేలు కోత విధించిన కాంట్రాక్టర్ శివశంకర్రెడ్డి నుంచి ఆ సొమ్మును తిరిగి కార్మికులకు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులపై బనాయించిన అక్రమ కేసులన్ని ఎత్తివేయాలన్నారు. కార్మికులను దూషిస్తూ అక్రమ తొలగింపులకు పాల్పడుతున్న కాంట్రాక్టర్ శివ శంకర్రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎఐటియుసి, ఐఎఫ్టియు నాయకులు మల్లికార్జున, ఏసురత్నం, ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు భీమేష్, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, నగర కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగేంత వరకు ప్రజా, కార్మిక సంఘాలుగా ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. ఈ నెలలో నిరసన సమయంలో స్పందించిన కలెక్టర్ యూనియన్ నేత ఓబులుకు ఇచ్చిన హామీని నెలబెట్టుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఇది వరకు పని చేస్తున్న కార్మికులందరిని విధుల్లోకి తీసుకుని వేతనాలు చెల్లించాలని వారు కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెలోకి వెళ్లడం ఖాయమని యూనియన్ నాయకులు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్కు సమస్యను వివరించి పరిష్కరించేలా విజ్ఞాపన పత్రాలు అందజేద్దామని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి, కోశాధికారి వన్నూరుస్వామి, మాజీ కార్యదర్శి గంగాధర, రామాంజినేయులు, నాగరాజు, నరేష్, రామాంజినేయులు, ఆదిరెడ్డి, సిఐటియు నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

ఈ పండ్లు తింటే పడకే..!




- పక్వానికి రాకముందే రసాయనాలతో మగ్గిస్తున్న వైనం
- రంగు తప్ప రుచి లేని పండ్లతో ఆరోగ్యానికి ప్రమాదం
- ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం
- అన్నీ తెలిసినా అందరిలోనూ ఉదాసీనతే

పట్టణంలో ఎటూ చూసినా మామిడి పండ్లు కనిపిస్తున్నాయి. చూస్తే నోరూరేలా నిగనిగలాడిపోతున్నాయి. అలా అని కొని నోట్లో వేసుకుంటే పుల్లగా, కాస్త వెగటుగా ఉంటున్నాయి. పక్వానికి రాకముందే కాయల్ని కోసి, రసాయనాల వినియోగంతో వాటిని పండ్లుగా మార్చడం వల్ల కలిగే అనర్థానికి నిదర్శనమిది. మామిడి పండ్లు పూర్తిస్థాయిలో పక్వతతో పండితేనే మంచి రుచి ఉంటుందని తెలిసినా, వాటిని ముందుగానే కోసి, రసాయనాలతో పండించడం వల్ల రుచి ఉండదు సరికదా, ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఈ ప్రక్రియ చట్ట ప్రకారం నేరం కూడా. అయినా వ్యాపారులకు ఇవేవీ పట్టవు. నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 1.25 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. అయితే ఈ ఏడాది జిల్లాలో మామిడి దిగుబడి గణనీయంగా తగ్గింది. సాధారణంగా ఎకరాకు 15 టన్నుల వరకు దిగుబడి వచ్చేది. ఈ ఏడాది ఐదు నుంచి ఏడు టన్నుల వరకు దిగుబడి తగ్గింది. స్థానికంగా అమ్మడంతో పాటు ఇక్కడి నుంచి కర్నాటక రాష్ట్రం బెంగళూరు, శ్రీనివాస పుర, బీజాపుర్తో పాటు తెలంగాణ రాష్ట్రం హైదరబాదు తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది మామిడి దిగుబడి తక్కువగా ఉంది. దీంతో ఎగుమతులు సైతం తగ్గాయి. ఉన్న మామిడిని ఎప్పటిలాగానే పక్వానికి రాక ముందే పంటను కోసేస్తున్నారు. వాటిని ఆకర్షణీయంగా పండించేందుకు నిషేధిత రసాయనాలన్నీ వినియోగిస్తున్నారు. కార్బైడ్ దొరకని పక్షంలో పొరుగు దేశాల నుంచి దిగుమతి అయిన పౌడర్లు, రసాయనాలతో మామిడిని మగ్గిస్తున్నారు. దీంతో అమృత ఫలాలు కాస్తా విష ఫలాలుగా మారిపోతున్నాయి. ఈ తరహాలో పండించిన మామిడి పండ్లను తినడం ద్వారా జీర్ణక్రియ, క్యాన్సర్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తు తాయని వైద్య నిపుణులు హెచ్చ రిస్తున్నారు. చాలా మంది రైతులు తమ ఇళ్లలోనే ఒక గదిలో మామిడి కాయలను ఉంచి కార్బైడ్, అగర బత్తి పొగ ద్వారా మగ్గిస్తారు. ఈ తరహాలో మామిడి కాయలను పండుగా తయారు చేయడం వల్ల త్వరగా పండు పక్వానికి వచ్చేయడం, తక్కువ ఖర్చుతో కూడుకోవడంతో అందరూ దీనినే అనుసరిస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. దీనికి కనీసం 3 నెలల జైలు, రూ.లక్ష జరిమానా విధించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని అనుసరించి అధికారులు తనిఖీలు చేసి పక్వానికి రాక ముందే రసాయనాలతో మామిడిని పండిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికి అధికారులు ఎవరు ఆ మేరకు చర్యలు తీసుకోవటం లేదు. ముఖ్యంగా రైతులు పండించిన కాయలను పక్వానికి వచ్చినప్పుడే కోతకోయాలి. కోసిన కాయలను వారికి, అనుకూలంగా ఉన్నట్లయితే బోదగడ్డి, వరిగడ్డి లేకర్లుగా వేసి మాగించే విధానాలు పాటిస్తే మంచిది. రైతులకు అనుకూలంగా లేకపోతే కాయలను మగ్గించేందుకు ప్రభుత్వమే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు రైఫనింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అనంతపురం మార్కెట్ యార్డులో పండ్లు మగ్గించేందుకు మూడు ఛాంబర్స్ ఉన్నాయి కదిరి, గుత్తి, కళ్యాణదుర్గం, మార్కెట్ యార్డులలో ఒక్కోక్కటికిగా నిర్వహిస్తున్నారు ఈ విధానంతో పండ్లను మగ్గిస్తే ప్రజలకు ఆరోగ్య పరంగా సమస్యలు తలెత్తవు. రైతులు పండించిన ఉద్యాను తృత్తులు మామిడితో పాటు సపోటా, అరటి, కర్బూజా, పైనాపిల్, బొప్పాయి వంటి వాటికి మగ్గించేదుకు ఈ కేంద్రాలను వినియోగిం చుకొనే అవకాశాలున్నాయి. కాయలను కోసినప్పుడే పక్వానికి వచ్చిన సమయంలో కోత కోసుకొనే విధంగా ఆ శాఖ అధికారులు సలహాలు ఇవ్వాలి.



మామిడి కాయలు మగ్గడానికి రసాయనిక పౌడర్ ప్యాకెట్లు వేసిన దృశ్యం(వృత్తంలో)

ఈ పండ్లుతింటే రోగాలే..

కార్బేడ్స్, కార్బ్రైడ్ తదితర రసాయనంతో మగ్గిస్తున్న పండ్లను తింటే క్యాన్సర్, మూత్రపిండ, జీర్ణకోశ తదితర వ్యాధుల బారిన పడతారని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవన్ని తెలిసినా కంటికి ఇంపుగా కనిపిస్తే చాలా కొనుక్కొని తింటున్నాము. తనిఖీ అధికారులు అడపా దడపా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటునే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. దీంతో హోల్సేల్ వ్యాపారుల ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోతోంది.. ప్రజారోగ్యంతో చలగాటం ఆడుతున్న వ్యాపారుల మీద సరైన చర్యలు తీసుకోకపోవడంలో ఎవరెలా పోతే మాకెంటి, ఏదో కాలం వెల్లబుచ్చుతున్నామన్న చందంగా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కేసులు పెడితే వచ్చేలాభం ఏముందన్న ధోరణితో అధికారులు మామూళ్లు పుచ్చుకొని వెళుతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

వ్యత్యాసం గుర్తించడం సులువే

సహజంగా పండిన మామిడి పండ్లు, రసాయనాలతో మగ్గించిన మామిడి పండ్లను గుర్తించడంలో ఒక సులువైన మార్గం ఉంది. సహజంగా పండిన మామిడి పండును నీటిలో వేస్తే అది మునిగిపోతుంది. అదే రసాయనాలతో మగ్గించిన పండు అయితే పండు పెద్దది అయినప్పటికీ, బరువుతో ఉన్నా అది నీటిలో తేలుతుందని రైతులు అంటున్నారు. అంతే కాకుండా సహజంగా పండిన మామిడి పండు అయితే దాని బొడ్డు వద్ద వాసన చూస్తే రుచికరమైన వాసన వస్తుంది. అదే రసాయనంతో పండిస్తే అటువంటి సువాసన రాదు.

అధికారులు కేసులు పెట్టడం లేదు.....

రసాయనాలతో పండ్లను మాగించే వారిపై వ్యవసాయ, ఉద్యానవన శాఖాదికారులు, సీనియర్ ఫుడ్ ఇన్స్పెక్టర్లు కేసులుపెట్టే అధికారాన్ని ప్రభుత్వం కల్పించింది. రసాయనాల ద్వారా పండ్లు మగ్గిస్తే ఏడాది పాటు జైలుశిక్ష, రూ.5లక్షలు జరిమానా విధించే విదంగా వ్యవహరించాలని కోర్టు ఆదేశించింది. రెవెన్యూ, పోలీసులు సైతం పండ్లను రసాయనంతో మగ్గిస్తే కేసులు పెట్టవచ్చు. అయినప్పటికి ఆయా శాఖల మధ్య సమన్వయ లోపంతో, పండ్ల వ్యాపారులపై ఎవరు పట్టించుకోవడం లేదు. అధికారులు అందరు కలిసి ఒక్క సారిగ పండ్ల వ్యాపారులపై తనిఖీలు ముమ్మరం చేస్తే పెద్ద మాఫియా బయట పడుతుంది.

ధర అధికమే

మార్కెట్లో మామిడి పండ్ల ధర కాస్త అధికంగానే ఉంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా లభించే బేనిష మామిడిపళ్లు కిలో రూ.70 వరకు విక్రయిస్తున్నారు. మల్లిక మామిడిపళ్లు కిలో రూ.100, మలగూబ కిలో రూ.120 నుంచి 150 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. రసపూరి మామిడిపళ్లు కిలో రూ. 110 నుంచి 130 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. ఇతర జాతుల పండ్లు రూ.80 వరకు అమ్ముతున్నారు.

రసాయనాలతో మగ్గిస్తే దుష్పరిణామాలు



ప్రస్తుతం మార్కెట్లో నిగనిగలాడుతూ కనిపిస్తున్న మామిడి పండ్లు అన్ని పక్వానికి వచ్చి మగ్గినవి కాదు. పలు రకాల రసాయనాలు కలిపి మగ్గ బెడుతున్నారు. వీటివల్ల అనేక రకాలైన సమస్యలు తలెత్తుతాయి. గ్యాస్టిక్, చర్మ సమస్యలు, ఆక్సిజన్ లెవెల్స్ తగ్గిపోవడం, నరాలకు సంబంధించిన సమస్యలు సాధారణంగా వస్తుంటాయి. అదే పనిగా రసాయనాలతో మగ్గపెట్టిన మామిడి పండ్లను అధికంగా తింటే క్యాన్సర్, కిడ్నీ, లివర్ సమస్యలు వస్తాయి. రసాయనాలతో మగ్గపెట్టిన మామిడి పండ్లను తినకపోవడం చాలా మంచిది.

డాక్టర్ వెంకట రమణ నాయక్
ఫిజిషియన్, జిల్లా ప్రభుత్వ అసుపత్రి
హిందూపురం



అమ్మకానికి తోపుడు బండ్ల మీద సిద్ధంగా ఉంచిన మామిడి పండ్లు

ప్రభుత్వ భూమిలో లేఅవుట్..!

వాగులు, వంకలనూ వదలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలో వాగులు, వంకలు, ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించుకుని యథేచ్ఛగా లేఅవుట్లు వేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నంబుల పూలకుంటలోని మండల రెవెన్యూ కార్యాలయం రోడ్డు పక్కనే లేఅవుట్ వెలిసింది. ఆ ప్రదేశం ముందు నుంచి ఖాళీగా ఉండేది. అటువైపు ఉన్న పొలాలు, చెరువుకు గ్రామస్తులు ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగించేవారు. అయితే ఈ ప్రాంతం చుట్టుపక్కల భూమిని కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రస్తుతం ఆ భూమిని కలుపుకొని దర్జాగా లేఅవుట్ వేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే మరికొన్ని ప్రాంతాల్లో వాగులు, వంకలను ఆక్రమించుకోవడంతో వర్షాకాలం లో చిన్నపాటి వర్షం కురిసినా నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉంటుందని, దీంతో ఆయా ప్రాంతాల్లో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై సిపిఎం రైతు సంఘం నాయకుడు నాగిరెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఓ వైపు వాగులు, వంకలు మరోవైపు ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని ప్లాట్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నా అడిగే వారే కరువయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నంబులపూలకుంటలో వాగులు, వంకలు, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని మండల ప్రజలు, వామపక్షాల తరఫున కోరారు.

కార్మిక, కర్షక భవన నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి విమానాశ్రయం సమీపంలో నిర్మించతలపెట్టిన కార్మిక, కర్షక భవన నిర్మాణ పనులను ఆదివారం ఇంజినీరింగ్ విభాగం సభ్యులు, సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో సిపిఎం ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలతో మంగళవారం మొదటి అంతస్తుకు స్లాబ్ వేస్తున్నారు. ఈ తరుణంలో ఇంజినీరింగ్ నిపుణులు నిర్మాణ పనులను పరిశీలించారు. వారితో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిఐటియు సీనియర్ నాయకులు రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, జిల్లా కోశాధికారి సాంబశివ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కదిరప్ప పనులను పరిశీలించారు. ఈ భవన నిర్మాణం రూఫ్ లెవెల్‌కు రావడానికి శ్రమించిన కార్మికులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎంతోమంది కార్మిక, కర్షకులకు ఈ భవనం ఆసరాగా ఉంటుందని, ఈ భవన నిర్మాణానికి ప్రతి కార్మికుడు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. మంగళవారం స్లాబ్ వేస్తారని, కార్మికులు, కర్షకులు, సిపిఎం, సిఐటియు నాయకులు కార్యకర్తలు కలిసి రావాలని కోరారు.



ఉచిత వైద్య శిబిరంలో కంటిపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగేంద్ర

లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శప్రాయం : సిఐ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రజా సేవ, సమాజ హితం కోసం బాధ్యతగా పని చేస్తున్న సంస్థల్లో లయన్స్ క్లబ్ ముందు వరుసలో ఉంటుందని, మిగిలిన స్వచ్ఛంద సంస్థలు ఇలానే పని చేస్తే పేదలకు న్యాయం చేసిన వారవుతారని వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు గోసే రాధాకృష్ణ తన తల్లి గోసే రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి 90 మంది హాజరుకాగా అందులో 40 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. లయన్స్ క్లబ్ కోశాధికారి వేణుగోపాలాచార్యులు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి సిఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎందరో మహానుభావులు సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తూ పేదలకు అండగా నిలుస్తుంటారన్నారు. లయన్స్ క్లబ్ పాలక వర్గం, ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి పేదలకు సాయం చేయడం, వృద్ధులకు కంటిచూపు ప్రసాదించడం అభినందనీయమన్నారు. గోసే రాధాకృష్ణ, వేణుగోపాలాచార్యులు తమ సంపాదనలో కొంత మొత్తాన్ని ప్రజాసేవకు కేటాయించడం హర్షణీయమన్నారు. మరికొన్ని సంఘాలు, పట్టణ ప్రముఖులు ముందుకొచ్చి పేదలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పల్లెం వేణుగోపాల్, చెన్నంశెట్టి జగదీశ్, గూడూరు రాజగోపాల్, గోసే రాధాకృష్ణ, ముక్తాపురం క్రిష్ణ, పీడీలు రమేశ్, నాగేంద్ర పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న గుండుమల తిప్పేస్వామి, ఎంఎస్ రాజు

టిడిపి కార్యకర్తలను ఆదుకుంటాం

నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల, ఎమ్మెల్యే అభ్యర్థి రాజు

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ కారణాలతో మృతి చెందిన టిడిపి కార్యకర్తల కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు భరోసా ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను ఆదివారం వారు పరామర్శించారు. మండలంలోని గౌడనహళ్లి గ్రామానికి చెందిన నాయకుడు నాగరాజు కొన్ని రోజుల క్రితం గుండెపోటుతో మరణించగా ఆయన కుటుంబాన్ని పరామర్శించార. అమరాపురం క్లస్టర్ ఇన్‌ఛార్జి రవికుమార్ సోదరుడు, వీఆర్వో ఓబులేసు శనివారం అనారోగ్యంతో మరణించగా వారి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి వెంట రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, నాయకులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

హిందూపురం : పట్టణంలోని కొట్నూరులో ఉన్న నిర్మల వృద్ధాశ్రమంలో ఆదివారం బెంగళూరుకు చెందిన సప్తగిరి మెడికల్ కాలేజీ రీసెర్చ్ సెంటర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు వృద్ధులకు ఈసీజీ, బిపి, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ తరచూ వృద్ధాశ్రమంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు వైష్ణవి, ఇతర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, వైద్యశాల కో ఆర్డినేటర్ జయవర్ధనగౌడ్, అఖిల భారత ఫ్రీడం ఫైటర్ షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్, ఉబెదుల్లా హుసేన్, రిజాఉర్ రహమాన్, గంగప్ప, బాబన్న, జానప్ప, అంజినప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులతో వైద్య సేవలందించిన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

'పురం'లో ఆకట్టుకున్న పోలీసుల మాక్‌డ్రిల్

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు : డీఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

"నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద కొందరు ఆందోళనకారులు ప్లకార్డులు పట్టు కొని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈలోగా వాహనాలపై వచ్చిన పోలీసులు మొదట గా హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆందోళకారులు నినాదాలు చేసుకుంటూ దూసుకొచ్చారు. దీంతో వారిపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఆందోళనకారులు తిరుగుబాటు చేయడంతో పోలీసులు బాష్పవాయువు(టియర్ గ్యాస్) ప్రయోగించడంతో ఆందోళనకారులు చెల్లాచెదురయ్యారు. మళ్లీ ఆందోళనలు కొనసాగించడంతో రబ్బర్ బుల్లెట్లతో ఫైరింగ్ చేశారు. గాయపడిన వారిని అంబు లెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఇదంతా గమనిస్తున్న ప్రజలు ఒక్కసారిగా హడలిపోయారు. ఇదంతా నిజమని నమ్మి పట్టణంలో ఏం జరుగుతుందో కొంత సేపు అక్కడున్న వారికి అర్థం కాలేదు." అయితే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓట్ల లెక్కింపు రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు తీసుకునే చర్యల్లో భాగంగానే ఆదివారం మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారని తెలియడంతో అక్కడున్న వారంతా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు నిర్వహించిన మాక్ డ్రిల్ అందరినీ ఆకట్టుకుంది. శాంతిభద్రతలను పరిరక్షించటమే ధ్యేయంగా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ కంజాక్షన్ ఆధ్వర్యంలో ఆర్మ్ రిజర్వు, లా అండ్ ఆర్డర్ పోలీస్ సిబ్బందితో పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల తుది ఫలితాలు వచ్చేంత వరకూ అల్లర్లు, అసాంఘిక చర్యలు, అవాంఛనీ య ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా పోలీస్ యంత్రాం గం మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. ఈ మాబ్ ఆపరేషన్ పోలీసు సన్నద్ధత, ప్రజల్లో అవగాహన, చైతన్యం తీసుకొచ్చేందుకు దోహద పడుతుందన్నారు. జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ ఆంక్షలు అమలులో ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తుల మూకలను నియంత్రించడమే లక్ష్యమన్నారు. ఒకచోట నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడి ఆందోళనలు, హింసాత్మక ఘటనలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై లాఠీఛార్జ్, ఫైరింగ్ చేయడానికి వెనకాడబోమని హెచ్చరించారు. ప్రజలెవరూ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యల్లో పాల్గొనవద్దని సూచించారు. జూన్ 4వ తేదీ ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు, గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ రోజు, ఫలితాల అనంతరం ఎవరైనా అల్లర్లు, ఘర్షణలు, హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందితే ముందస్తు అరెస్టు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పెట్రోల్ బంకుల్లో లూజు పెట్రోల్ విక్రయాలను నియంత్రించామని తెలిపారు. పేలుడు పదార్థాలు, బాణసంచా విక్రయాలకు అనుమతి రద్దు చేశామన్నారు. ఓట్ల కౌంటింగ్, తుది ఫలితాల అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఎటువంటి విజయోత్సవ ర్యాలీల నిర్వహణకు అనుమతులు లేవన్నారు. శాంతియుతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు జిల్లా పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిఐలు రియాజ్‌అహ్మద్, శ్రీనివాసులు, ఆర్ఐ చంద్రశేఖర్, ఎస్ఐలు గోపి, గంగాధర్, హారుణ్‌బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హింసాత్మక ఘటనల్లో అల్లరి మూకలను చెదరగొట్టడంపై పోలీసుల మాక్ డ్రిల్

అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యం:ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా పోలీసులు కార్డెన్ సెర్చ్‌లు, సోదాలు చేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి స్పష్టం చేశారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం జిల్లా వ్యాప్తంగా సమస్యా త్మక గ్రామాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సమసాత్మక ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా దాచి ఉంచిన ఆయుధాలు, పేలుడు పదా ర్థాలు, బాణసంచా, పెట్రోల్, డీజిల్, పత్రాలు లేని అనుమానిత వాహనాలను సీజ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్లలో సిఐలు, ఎస్ఐలు సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో, ఫలితా తర్వాత కూడా జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. శాంతి భద్రతలను పరిరక్షించాలనే ఉద్దేశంతో చట్ట వ్యతిరేక కార్య కలాపాలను అణచివేసి, అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. ఎన్నికల కౌంటింగ్ వరకూ నిరంతరం అనుమానిత ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తారన్నారు. జిల్లాలో ఎక్కడా బాణసంచా విక్రయించరాదని, పెట్రోల్ బంక్ సిబ్బంది, యజమానులు విడిగా బాటిల్స్‌లో కానీ, క్యాన్‌లలో ఆకనీ పెట్రోల్, డీజిల్ నింపరాదని పోలీసులు హెచ్చరించారు. ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినా, ఘర్షణలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని గ్రామ సభల ద్వారా ప్రజలకు సూచించారు.

గ్రామాల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

నల్లచెరువు : మండలంలోని కుమ్మరవాండ్లపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం ఎస్ఐ కెఎం లింగన్న పోలీసు సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నిషేధిత వస్తువులు, మారణా యుధాలు, తదితర వస్తువులు ఏమైనా దాచి ఉంటారని అనుమానిత ఇళ్లు, స్థలాల్లో సోదాలు చేశారు. అలాగే ప్రజలతో సమావేశం నిర్వహించి ఎలక్షన్ కౌంటింగ్ రోజు, ఫలితాల అనంతరం ఎవరు ఎలాంటి గొడవలకు పాల్పడరాదని హెచ్చరించారు. 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నాయని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

గోరంట్ల : మండలంలోని వెంకటరమణపల్లి గ్రామంలో ఆదివారం సిఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు ప్రతి ఇంట్లో సోదాలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇళ్లలో మారణాయుధాలు ఏమైనా ఉన్నాయో అనే అనుమానంతో సోదాలు నిర్వహించామని తెలిపారు. అలాగే గ్రామంలో 12 ద్విచక్ర వాహనాలకు లైసెన్సులు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు. పెట్రోల్, డీజిల్‌ను విడిగా బాటిళ్లలో విక్రయించరాదని హెచ్చరించారు. కౌంటింగ్ రోజున గ్రామంలో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా ఉండాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హెచ్చరించారు.



గ్రామాల్లో ప్రజలకు సూచనలు ఇస్తున్న పోలీసు అధికారులు

నిద్రమత్తులో జిల్లా విద్యాశాఖ..!

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నాగార్జున

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాన్ని అరికట్టడంలో జిల్లా విద్యాశాఖ అధికారి విఫలమయ్యారని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నామాల నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటు న్నా, బహిరంగంగా హోర్డింగ్ రూపంలో ప్రచారం, క్యాంపెయిన్ చేస్తున్నా జిల్లా విద్యాశాఖ యంత్రాం గం పట్టించుకోకుండా నిద్రమత్తులో ఉన్నారని మండిపడ్డారు. ప్రధానంగా కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, తదితర ఎలాంటి విద్యా సామగ్రి అమ్మకూడదని నిబంధన ఉన్నా ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు పెడచెవిన పెట్టాయన్నారు. విచ్చలవిడిగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, వగైరా విద్యాసామగ్రి విక్రయిస్తూ విద్యాసంస్థలను కిరాణా దుకాణంగా మార్చి జేబులు నింపుకోవడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా జిల్లా విద్యాశాఖ యంత్రాంగం నిద్రమత్తు వీడి జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాల విక్రయం, ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలను అతిక్రమించిన విద్యాసంస్థలపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నాగార్జున

నాణ్యమైన విద్యనందించాలి : రఘువీరా

ప్రజాశక్తి-మడకశిర

పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సిడబ్ల్యుసి మెంబర్, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి సూచించారు. వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ వారు మండలం లోని అయ్యవారిపల్లి గ్రామంలో కొత్తగా ఏర్పాటుచేసిన వైస్ వుడ్ పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమం లో ఆదివారం రఘువీరా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పాఠశాలలు ఏర్పాటు చేయడం కష్టంతో కూడిన పని అయినా ఈ స్థాయిలో ఇక్కడ పాఠశాల ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. పాఠశాలలో గ్రామీణ ప్రాంత విద్యార్ధురులకు నాణ్యతతో కూడిన విద్యనందించి సమాజాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచి సత్యనారాయణ, బిజెపి నాయకులు పురుషోత్తం, పాఠశాల నిర్వాహకులు నారాయణరెడ్డి, దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

కర్నాటక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డిటి శ్రీనివాస్‌ను గెలిపించాలని సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి కోరారు. ఆయన ఆదివారం పావగడ పట్టణంలో ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కర్నాటకలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పావగడ ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేష్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఉపాధ్యాయులు, పట్టభద్రులు పాల్గొన్నారు.



పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

చిన్న పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చిన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేకమైన శ్రద్ధ కనబరచాలని చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్. కె.మహేంద్ర తెలిపారు. పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు సాయి నగర్‌లో ఉన్న స్పందన ఆసుపత్రిలో ఆదివారం నిర్వాహకులు డాక్టర్.బషీర్, డాక్టర్. సోనియా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మహేంద్ర మాట్లాడుతూ పిల్లల్లో జ్వరం, విష జ్వరాలు, దగ్గు, ఊపిరితిత్తుల సమస్యలు, కడుపునొప్పి, మలేరియా, టైఫాయిడ్, న్యుమోనియా, పచ్చకామర్లు, బేదులు, మెదడు వ్యాపు వ్యాధి, తదితర జబ్బుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వీటన్నిటికీ ప్రభుత్వ పథకాల ద్వారా ఉచితంగా అడ్మిషన్ చేసుకొని వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఎండాకాలం, వానాకాలం, చలికాలంలో పిల్లలకు వైద్యుల సలహా మేరకు ఆహారంతో పాటు తగిన భద్రత కల్పించాలని తెలిపారు. పిల్లలకు అత్యవసరమైనప్పుడు ఐసియు, ఫొటోథెరపి, హైఫ్లో ఆక్సిజన్ మిషన్స్, వెంటిలేటర్లు ఉపయోగించుకోవాలని తెలిపారు. పిల్లల ఆరోగ్య భద్రత పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. డాక్టర్ బషీర్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం స్పందన ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ శిబిరంలో 63 మంది చిన్న పిల్లలు వైద్యసేవలు పొందారన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ బాబా, దిల్దార్, నర్సులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత

ప్రజాశక్తి-కొత్తచెరువురూరల్

సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సమాజ సేవకు, పేద ప్రజలకు పంచాలన్న ఉద్దేశంతో నల్లమాడకు చెందిన వైసిపి యువనేత టిడి.కృష్ణసుమన్‌రెడ్డి అనాథలకు తనవంతు సాయం అందజేస్తున్నారు. కొత్తచెరువుకు చెందిన చౌడమ్మ, ఆంజనేయులు దంపతులకు నలుగురు సంతానం. ఇటీవల అనారోగ్యంతో ఆ దంపతులు మృతి చెందడంతో నలుగురు పిల్లలు అనాథలయ్యారు. వారు పొట్ట నింపుకోవడమే కష్టంగా మారి జీవనం సాగించేందుకు అష్ట కష్టాలు పడుతు న్నారు. ఈ విషయం తెలుసుకున్న కృష్ణసుమన్‌రెడ్డి ఆదివారం వారి వద్దకు వెళ్లి ఇంట్లోకి అవసరమయ్యే ఫర్నిచర్‌తో పాటు ఒకొక్కరికి రెండు జతలు దుస్తులు అందజేశారు.

జెవివి ఆధ్వర్యంలో మూర్ఛ చికిత్స శిబిరం

సోమందేపల్లి : జన విజ్ఞాన వేదిక పెనుకొండ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పెనుకొండ పట్టణంలోని ఘనగిరి స్కూల్‌లో ఏర్పాటు చేసిన మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరాన్ని కరస్పాండెంట్ ఇలియాజ్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 22 మంది వ్యాధిగ్రస్తులకు డాక్టర్ నీలేఖ్య వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి హరి, పెనుకొండ జోన్ అధ్యక్షులు నబి, ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, సభ్యులు రమేష్, రామాంజనేయులు, రవి, యశ్వంత్, నాగార్జున పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ

హిందూపురం : ఇస్రో శాస్త్రవేత్త లతీఫ్ జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఉమర్‌ఫారూఖ్‌ఖాన్ ఆధ్వర్యంలో రోగులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశం కోసం నిత్యం శ్రమిస్తున్న శాస్త్రవేత్తల గౌరవార్థం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉమర్ ఫారూఖ్ ఖాన్ మిత్రులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్

నల్లచెరువు : సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో బెట్టింగ్ జోరుగా సాగుతోంది. ఏ నలుగురు కలిసినా ఎన్నికల ఫలితాలు, అభ్యర్థుల మెజారిటీపైనే చర్చించుకుంటున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు జూన్ 4వ తేదీ వరకూ సమయం ఉండడంతో మరి కొందరు పందెం కాసే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా మహిళా ఓట్లు ఎక్కువగా పోలయ్యాయని తద్వారా తమ కంటే తమకే ఎక్కువ మెజారిటీ వస్తుందని టిడిపి, వైసిపి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఫలితాల తర్వాత మండలంలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రజలు పేర్కొంటున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

లేపాక్షి : మండలంలోని బిసలమానేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా సప్పలమ్మ ఆలయ నిర్మాణం చేపట్టారు. దీంతో బిసలమానేపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ కుటుంబ సభ్యులు ఆదివారం రూ. 71వేలను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, వెంకటరెడ్డి, నారాయణస్వామి, మూర్తి, శివప్ప, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆవులు.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు

ప్రజాశక్తి-హిందూపురం



రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆవులు

పట్టణంలో రహదారులు చాలా వరకూ ఆక్రమణలకు గురయ్యాయి. పైగా ట్రాఫిక్ రద్దీ పెరిగింది. దీంతో పాటు ఆవుల సంచారం కూడా అధికమే. రహదారులపై ఆవుల సంచారంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో జనం అవస్థలకు గురవుతున్నారు. ఆవుల సంచారాన్ని అధికారులు నియంత్రించలేక పోవడంపై విమర్శలు వినవస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ నిత్యం రద్దీగా ఉంటాయి. వాహనాలూ అధికమే. వ్యాపారాలన్నీ రహదారులపై కొనసాగుతున్నాయి. ఎవరినీ ఏమీ అనలేని పరిస్థితి ఏర్పడింది. పెరిగిన వాహనాల రాకపోకలతో రహదారులన్నీ జామ్ అవుతున్నాయి. ఇటీవల కాలంలో ఆవుల సంచారమూ పెరిగింది. రహదారిపై అడ్డంగా నిలబడటంతో ట్రాఫిక్ కూడా ఆగిపోవాల్సి వస్తోంది. మున్సిపాలిటీ అధికారులు దీనిపై స్పందించడం లేదు. కొన్ని సందర్భాల్లో ఆవులతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కౌన్సిల్ సమావేశంలోనూ పలుమార్లు కౌన్సిలర్లు ఆవులతో జరిగే నష్టం, ఇబ్బందులను లేవనెత్తగా గోశాల కడుతున్నామని, అక్కడకు ఆవులన్నీ చేర్చుతామని చెప్పడమే కానీ ఆచరణలో చేయలేకపోతున్నారు. ఆవుల యజమానులకు నోటీసులు ఇచ్చి కనీసం హెచ్చరించినా కొంత సమస్య తగ్గేది. కానీ ఆ పని కూడా ఇక్కడి అధికారులు చేయకపోవడంతో ఆవుల సమస్య జఠిలంగా మారుతోంది. రహదారులపైకి వదిలే ఆవులను ఇతర ప్రాంతాలకు తరలిస్తామని హెచ్చరికలు జారీ చేస్తే ఏ ఒక్క ఆవు కూడా రహదారిపైకి రాదని కొందరి వాదన. ఆ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటే బాగుంటుందనేది ప్రజలు కోరుతున్నారు.

ధర్మవరం డిపోకు 4 కొత్త సూపర్ లగ్జరీ బస్సులు : డీఎం

ధర్మవరం టౌన్ : ధర్మవరం ఆర్టీసీ డిపోకు 4 కొత్త సూపర్ లగ్జరీ బస్సులు ఇటీవలే వచ్చాయని డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. డిపోలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సంక్షేమమే ఆర్టీసీ ధ్యేయమని తెలిపారు. నూతన బస్సులను ప్రయాణికుల తాత్కాలిక అవసరాల దృష్ట్యా బిహెచ్ఈఎల్, సికింద్రాబాద్, హైదరాబాద్‌కు నడుపుతున్నామన్నారు. మరొక బస్సు శని, ఆదివారాల్లో ప్రత్యేకంగా దూరప్రాంతాలకు పంపుతామని తెలిపారు. జులై నెలలో 25 బస్సులు జిల్లాకు రానున్నాయని, అలాగే ధర్మవరం డిపోకు కొత్త బస్సులు రానున్నాయని తెలిపారు. ప్రయాణికుల సుఖ ప్రయాణం కోసం కొత్త బస్సుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రస్తుతం ధర్మవరం డిపో నుంచి అనేక బస్సులు వివిధ దూర ప్రాంతాలకు, జిల్లాలో నడుస్తున్నాయని, ప్రయాణికులకు ఎక్కడైనా ఏదైనా సమస్య ఎదురైతే ధర్మవరం డిపో కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో ఉన్న అరిగెల పోతన హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ అరిగెల గణేష్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ శిబిరంలో అవిష్ హాస్పిటల్ హైదరాబాద్ డాక్టర్ రాధ రోగులకు వైద్యసేవలు అందించారన్నారు. కాళ్లల్లో సిరల వాపు వ్యాధి (వెరికోస్ వెయిన్స్), కీళ్ల నొప్పికి దీర్ఘకాలిక ఉపశమనం(జిఎఈ), మోకాలి నొప్పుల కు వైద్య చికిత్సల అందించారు. అనంతరం రోగులకు వెరికోస్ వెయిన్స్, లెగ్ అల్సర్ గురించి తెలిపారు. శిబిరానికి 150 మంది రోగులు వచ్చారని తెలిపారు. శిబిరంలో ఎపి పిఆర్‌ఒ శ్రీనివాస్, అరిగెల పోతన్న, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి-లేపాక్షి



గ్రంథాలయంలో పుస్తక పఠనంలో పాల్గొన్న చిన్నారులు

స్థానిక శాఖ గ్రాంథాలయంలో ఈ నెల 26వ తేదీ(ఆదివారం) నుంచి జూన్ 7వ తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిబిరంను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జయసింహ రాజు తెలిపారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలకు పుస్తక పఠనం, చదివించడం, కథలు చెప్పించడం, పుస్తక సమీక్ష, చిత్ర లేఖనం, స్పోకెన్ ఇంగ్లీషు, కవితలు, సులువుగా గణితం నేర్పించడం, డ్యాన్స్, చదరంగం, యోగా, క్యారమ్స్, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని బాల బాలికాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రాంథాలయ అధికారి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : పట్టణంలోని పౌర గ్రంథాలయ శాఖలో అధికారి మూడే బొజ్జే నాయక్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరానికి ఆదివారం 15 మంది బాల బాలికలు హాజర య్యారు. వారికి పుస్తక పఠనం, కథలు చెప్పించడం, హిందీ గ్రామర్, క్యారం బోర్డ్ , స్నేక్ లాడర్, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ విశ్వనాథ్, విద్యార్థినీ, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది ఖాదర్ బాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి పారితోషికం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు గోసే రాధాకష్ణ నగదు బహుమతి అందజేశారు. పట్టణంలోని బిఎస్ఆర్ బాలుర హైస్కూల్‌లో చదివిన మధు తనయుడు పి.నవదీప్ పదో తరగతి పరీక్షల్లో 549 మార్కులు సాధించాడు. దీంతో ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గోసే రాధాకృష్ణ తన తల్లి గోశే రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం విద్యార్థి నవదీప్‌కు వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం ద్వారా నగదు బహుమతిని అందజేశారు. గోసే రాధాకృష్ణ మాట్లాడుతూ తన తల్లి పేరిట పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో పాఠశాలల పీడీలు రమేష్‌బాబు నాగేంద్ర, లయన్స్ క్లబ్ కోశాధికారి వేణుగోపాలా చార్యులు పాల్గొన్నారు.



నవదీప్‌కు పారితోషకం అందజేస్తున్న పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, గోసే రాధాకష్ణ